క్లుప్తంగా

5 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు


లక్ష్మీనరసింహాస్వామి మూలవిరాట్

రొళ్ల: పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాలు 5 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. 5న అంకురార్పణ, 6న కలశ స్థాపన, కల్యాణోత్సవం, 7న బ్రహ్మరథోత్సవం, 8న వసంతోత్సవం, రొళ్లకొండపై దివ్య జ్యోతి దర్శనం, 9న గరుడోత్సవం, 10న పూల పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 11న దేవత సంకీర్తన, 12న భూతప్ప సేవ , 13న ప్రసాద వినియోగం, ముడుపుల ఉత్సవం, 14న మహా మంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అభివృద్ధి పథంలో సాగాలి

హిందూపురం: పట్టణంలోని 14వ వార్డులోని లక్ష్మీనరసింహ పొదుపు సంఘం ఏర్పడి 22 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పట్టణంలోని మెప్మా ఆఫీసులో ఆ సంఘ సభ్యులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఓఆర్ కిష్టప్ప మాట్లాడుతూ ఇచ్చిన రుణాలు తీసుకొని బాగా అభివృద్ధి చెందుతున్నారంటూ లక్ష్మీనరసింహ పొదుపు సంఘం సభ్యులను అభినందించారు. అభివృద్ధి పథంలో సాగాలని సూచించారు.

వ్యాపార మెలకువలు నేర్చుకోవాలి


స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్న విద్యార్థినులు

హిందూపురం టౌన్: సరికొత్త జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యార్థులు విద్యతో పాటు పారిశ్రామిక, వ్యాపార సూత్రాలపై మెలకువలను నేర్చుకోవాలని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి అన్నారు. మంగళవారం ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పారిశ్రామిక ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెస్టివల్ స్టాల్స్‌ను అధ్యాపకులు, విద్యార్థినులు సందర్శించారు.

సజావుగా వాహనాల వేలం

హిందూపురం: హిందూపురం సెబ్‌పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం వాహనాల వేలం పాటను సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ సమక్షంలో నిర్వహించినట్లు సీఐ స్వర్ణలత తెలిపారు. 16 వాహనాలకు రూ.1,44,500 ధర నిర్ణయించగా రూ.1,79,596 ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందన్నారు. అలాగే దాడుల్లో లభ్యమైన 34 బాక్సుల కర్ణాటక మద్యం ప్యాకెట్లను వాహనంతో తొక్కించి నాశనం చేసినట్లు సీఐ వివరించారు.

నేటి నుంచి సమ్మెలోకి ప్రభుత్వ ఉద్యోగులు


పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

పావగడ: 7వ వేతన సవరణలో జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తున్నట్లు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జి కిరణ్ తెలిపారు. పావగడ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ డిమాండ్ల పరిష్కారానికి గత నెల 27 వరకు గడువిచ్చినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతోనే సమ్మె చేస్తున్నామన్నారు.

చిట్టి బుర్రలు.. పెద్ద ఆలోచనలు

- హిందూపురం, పెనుకొండ, మడకశిరల్లోని పలు స్కూళ్లలో సైన్స్ డే
- ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు


పెనుకొండ: నమూనాను తిలకిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్

పరిగి: చదువుతోనే శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందుతుందని వక్తలు పేర్కొన్నారు. సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని నేషనల్ సైన్స్ డే మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల, పరిగి అమర్ విద్యా మందిరంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ లక్ష్మీదేవి ప్రారంభించారు.

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రగతి గ్లోబల్ జెన్‌హై స్కూల్లో, ఘనగిరి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ కార్తీక్ అన్ని పాఠశాలల్లో సైన్స్‌ఫేర్‌ను సందర్శించారు. విద్యార్థులు విజ్ఞాన వంతులు కావాలంటే ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో అవసరమన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే ని పురస్కరించుకొని విద్యార్థులచే ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ మేరకు విద్యార్థులు మంకీ గన్, మెడిసిన్ ప్లాంట్స్, వాతావరణ, పర్యావరణ మార్పులు, దర్పణం ప్రతిబింబాలు వంటి నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాఘవేంద్ర, సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

హిందూపురం టౌన్: స్థానిక పాండురంగనగర్‌లోని నారాయణ పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓ గంగప్ప పాల్గొని సైన్స్ ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో నారాయణ ఏజీఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్, ఏఓ నవీన్, అకాడమిక్ డీన్ పరమేష్, వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు పేర్కొన్నారు.

లేపాక్షి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఉదయం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్సు నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు నదిముల్లా భాషా, శ్యాంరాజ్, శ్రీనివాసులు, దేవిక, పుల్లమ్మ తదితరులు తిలకించారు.

గోరంట్ల: మండలంలోని బూదిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బూదిలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్ధనరెడ్డి, కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యయుడు అశోక్ పాల్గొన్నారు.

అమరాపురం: మండల పరిధిలోని వలస ఉన్నత పాఠశాల, సరస్వతి విద్యామందిరం, సాయి విద్యానికేతన్ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులు వివిధ తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలను హెచ్ఎంలు పరిశీలించారు. ప్రతి విద్యార్థి సైన్సుపై మక్కువ పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.


పరిగి: సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈఓ లక్ష్మీదేవి


చిలమత్తూరు: విద్యార్థులు రూపొందించిన నమూనాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడు


లేపాక్షి: ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


అమరాపురం: విద్యార్థుల తయారు చేసిన నమునాను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

నష్ట పరిహారం చెల్లించాలి

లేపాక్షి: మండలంలోని ఓబుళాపురంలో రైతు వేణుగోపాల్‌రెడ్డికి చెందిన కాలిపోయిన చెరుకు పంటను సంబంధిత శాఖాధికారులు పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి శివప్ప డిమాండ్ చేశారు. కాలిపోయిన పంటను మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించారు.

డివైడర్ తొలగించాలి

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఇబ్బందికరంగా మారిన డివైడర్ తొలగించాలని కోరుతూ సీపీఎం, సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కిడికి చేరుకొని ఆర్ అండ్‌బి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నదిలోకి దూసుకెళ్లిన కంటైనర్ వాహనం



చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కోడూరు మర్రో తోపు వద్ద ఓ కంటైనర్ వాహనం కుషావతి నదిలోకి దూసుకెళ్లింది. అనంతపురం వైపు నుంచి వస్తున్న కంటైనర్ వాహనానికి గోరంట్ల వైపు నుంచి వస్తున్న ఓ వాహనం అడ్డురావడంతో ఆ వాహనాన్ని తప్పించే క్రమంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఓ హోటల్ ధ్వంసం కాగా.. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

కొల్లాపురి మహాలక్ష్మికి పూజలు

గుడిబండ: మండల పరిధిలోని సి.సి.గిరి గ్రామంలో మంగళవారం కొల్లాపురి మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మహిళలు ఉపవాస దీక్షతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు నగర పంచాయితీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ అమృత్ – 20 పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.87 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. తద్వారా పట్టణంలో అవసరమైన ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంకులు, 90 కి.మీ మేర మున్సిపల్ పరిధిలో పైప్‌లైన్లు వేసి ప్రజలకు తాగునీటిని అందిస్తామన్నారు. త్వరలో సర్వే చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ఫర్జియాభాను, రఘునాథరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని పట్టించుకునే వారు లేరన్నారు. స్పందించిన చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరుకు మోటారు బిగిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి బీసీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను మంగళవారం పరిష్కరించినట్లు సర్పంచ్ తిప్పేస్వామి, కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. కాలనీలోని బోరు బావికి అమర్చిన మోటారు తరుచూ కాలిపోతుండడంతో కొత్త మోటారు బిగించి ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

అంగడి దగ్ధం


జంబులబండలో కాలిపోయిన అంగడి

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎండు గడ్డికి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న అంగడితో పాటు అందులో ఉన్న దినుసులు, ఫ్రిజ్ తదితర వస్తువులన్నీ కలిపోయాయి. దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు అంగడి నిర్వాహకురాలు లత తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

ఇష్టారాజ్యంగా మెడికల్ వ్యర్థాల కాల్చివేత


మెడికల్ వ్యర్థాలను కాల్చడంతో వస్తున్న పొగ


మంటను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- చర్యలు తీసుకుంటామన్న కమిషనర్

హిందూపురం: పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద పెద్ద ఎత్తున మెడికల్ వ్యర్థాలను పెద్ద పాడుబడ్డ బావిలో వేస్తూ నిప్పు పెట్టడంతో దుర్వాసనతో పాటు గ్యాస్ వాయువులతో ఆప్రాంతామంతా కాలుష్యమయమైంది. సోమవారం రాత్రి నుంచి గాలించినా మున్సిపల్ సిబ్బందికి ఎక్కడ నుంచి పొగ వెలువడుతున్నది తెలుసుకోలేకపోయారు. మంగళవారం కాలుష్య నియంత్రణ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆశాఖ సిబ్బంది డిటెక్టివ్ యంత్రం సహాయంతో టూటౌన్ పోలీసు సమీపంలోనే ఆటోనగర్‌లోని ఓ పాడుబడ్డ బావి నుంచి పొగ వస్తున్నట్లు గుర్తించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అగ్నిమాపక సిబ్బంది రప్పించి మంటలను ఆర్పించేశారు. పర్యావరణ కాలుష్యం చేయడంతో పాటు వాయు కాలుష్యానికి కారకులైన ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులను గుర్తించామని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వారందరికీ నోటీసులు జారీ చేస్తామన్నారు.

రథోత్సవం ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

చిలమత్తూరు: మండల కేంద్రంలో 7న నిర్వహించే కసుమ లక్ష్మీనారసింహస్వామి రథోత్సవం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రథోత్సవం రోజు ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రథంపైకి అనుమతి ఉన్న వారినే అనుమతించాలని సూచించారు.

ఇంటికెళ్లేది ఎవరో ప్రజలే నిర్ణయిస్తారు

పావగడ: స్థానిక జేడీఎస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప కేఆర్‌పీపీ అధినేత గాలి జనార్దనరెడ్డి వ్యాఖ్యలపై మంగళవారం మండిపడ్డారు. జేడీఎస్ పార్టీ ప్రణాళికలోని పంచరత్న పథకాల ప్రచారంలో భాగంగా 1, 2, 5 వార్డుల్లో ఆయన పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఇంటికి పోతారో.. ఎవరు ఉంటారో ప్రజలే నిర్ణయిస్తారని గాలి జనార్ధన రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. తమ పార్టీ నాయకులంతా కలసే ఉన్నామని, ఎవరూ బయటకు పోలేదన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ స్వర్ణలత

హిందూపురం టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ స్వర్ణలత అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దని సూచించారు. మత్తుకు బానిసైతే అన్ని విధాలా చేటినని హెచ్చరించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐలు పోతులయ్య, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టైలర్లు

హిందూపురం: టైలర్లను గుర్తించి ప్రత్యేకంగా జగనన్న చేదోడు పథకం అమలు చేసి ఆర్థిక చేయూత అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టైలర్లు అసోసియేషన్ నాయకులు కొనియాడారు. మంగళవారం టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ముక్కడిపేటలో అసోసియేషన్ సభ్యులు టైలర్ మిషన్ సృష్టికర్త ఎలియాస్ హౌయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేశారు. టైలర్ల సంఘం అధ్యక్షుడు జబీవుల్లా, రఫీ, జఫ్రుల్లా, ఇనాయత్, రామాంజి, సత్తర్, అన్వర్, షరీఫ్ తదతరులు పాల్గొన్నారు..

హిందూపురం టౌన్: పట్టణంలోని లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నానెప్పనగర్‌లో కొత్త మంది టైలర్లను పూలమాలలు వేసి సన్మానించారు. కోవిడ్ సమయంలో ప్రజలకు ఉచితంగా మాస్కులను కుట్టి పంచిపెట్టిన టైలర్లు గంగాధర్, ప్రకాష్, మూర్తిలను సన్మానించారు. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోజ్ జూలియట్, కృష్ణా నాయక్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో రాజీ వద్దు


మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ పరమేశ్వరరెడ్డి

పెనుకొండ: ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడొద్దని ఎంపీపీ గీతారామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కలసి కట్టుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ శ్రీరాములు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టిసారించాలన్నారు. హౌసింగ్, నీటి సమస్య, విద్యుత్ సమస్య, జగనన్న ఇళ్ల నిర్మాణం తదితర వాటిపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప, వైస్ ఎంపీపీలు చంద్రకళ, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

గోరంట్ల: గోరంట్ల ఏడీసీసీ బ్యాంక్ పరిధిలోని పాలసముద్రం సహకార సంఘం ద్వారా పంట రుణాలు పొందిన రైతులు రెన్యూవల్ చేసుకొని ఏడుశాతం వడ్డీ రాయితీని పొందాలని సహకార సంఘం అధ్యక్షుడు పాటూరి శంకరరెడ్డి, సీఈఓ సందీప్ తెలిపారు. పంట రుణాలు రెన్యూవల్ చేసుకొనే రైతులు గ్రామ సచివాలయల్లో భూమికి సంబంధించిన అడంగల్,1 బి , ఆధార్‌కార్డు , పట్టపాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు ఫొటోలు తీసుకొని సీఈఓను సంప్రదించాలన్నారు.

రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటేయండి


కరపత్రాలను అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు, వెన్నపూస రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస శివారెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని తపాల కార్యాలయం, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ కార్యాలయం, ప్రైవేటు బ్యాంకులు తదితర చోట్ల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను అందజేస్తూ తప్పని సరిగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఓటు వేసే విధానంపై నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిజాముద్దీన్, సోహెల్, బెన్ని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఎమ్మెల్సీ మంగమ్మకు సన్మానం

పెనుకొండ: పట్టణంలోని వన్నికా ఫంక్షన్ హాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

సమస్యలపై చర్చించిన నాయీ బ్రాహ్మణులు

పెనుకొండ: పట్టణంలో మంగళవారం నాయీ బ్రాహ్మణులు సమావేశమయ్యారు. ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, మాల్యవంతం మారుతి ప్రసాద్ తదితరులు నాయీ బ్రాహ్మణుల సమస్యలపై చర్చించారు. నాయకులు బాబన్న, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుసుము వసూలు చేయండి

పెనుకొండ: సకాలంలో ఇంటి కొళాయిల పన్నులు, డిపాజిట్లు వసూలు చేయాలని కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఇంటి కొళాయి డిపాజిట్ల విషయంలో వలంటీర్ల వైఫల్యాన్ని ప్రశ్నించారు.

గర్భిణులకు అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న రాజీ మణి ఔదార్యాన్ని చాటుకున్నారు. తన మనవరాలు లలిత జన్మదినం సందర్భంగా మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు.

ఐదు గొర్రెల అపహరణ

రొద్దం: మండల కేంద్రంలోని కొత్త ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాయం-2 సమీపంలో రైతు గఫూర్‌కు చెందిన రూ.50 వేలు విలువ చేసే ఐదు గొర్రెలు అపహరణకు గురయ్యాయి. ఇందులో భాగంగానే బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి తమ గొర్రెల మందలో ఐదు గొర్రెలను దుండగులు ద్విచక్ర వాహనాల్లో వచ్చి ఎత్తుకెళ్లారన్నారు. వారం రోజుల క్రితం కూడా ఒక గొర్రె చోరీకి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు మెరుగు కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రొళ్ల, బీజీ హళ్లి ఉన్నత పాఠశాలతో పాటు బీజీ హళ్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్

మడకశిరరూరల్: మండల పరిధిలోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలోని 80 సీట్ల భర్తీకి 2023–24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రామాంజినేయరెడ్డి, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ ఫణీంద్రకుమార్ తెలిపారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 4 లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సుమాదేవికి ఘన నివాళి

రొద్దం: మండల పరిధిలోని చిన్నమంతూరుకు చెందిన రామచంద్రారెడ్డి సతీమణి, వైఎస్సార్‌సీపీ సర్పంచ్ దివంగత సుమాదేవి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సుమాదేవి చిత్రపటానికి తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఈఓఆర్డీ కేశవరెడ్డి, ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతీప్రసాద్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఘనంగా నివాళులర్పించారు.

హుండీ కానుకల లెక్కింపు

అమరాపురం: హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం హుండీ కానుకలు లెక్కించగా రూ.5.62 లక్షలు ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, కమిటీ చైర్మన్ మంజునాథ్ తెలిపారు.

రేపు సర్వసభ్య సమావేశం

మడకశిర(అగళి): అగళి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.